క్లుప్తంగా

కేరళ ఆయుర్వేదం సర్వరోగ నివారిణి



వైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

సదాశివపేట(సంగారెడ్డి): కేరళ ఆయుర్వేదం సర్వరోగాలను నయం చేస్తుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం పట్టణంలో డాక్టర్ రాజేష్ ఏర్పాటు చేసిన ఆర్య వైద్యశాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్ పాల్గొన్నారు.

ముందస్తు రాఖీ వేడుకలు



రాఖీ కడుతున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకైన రాఖీ బంధన్ వేడుకలను పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తుగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులు రాఖీలు కట్టారు. ఆటపాటలతో సందడి చేశారు. పట్టణంలోని పస్తాపూర్ ఆర్‌ఎల్ఆర్ స్కూల్‌లో నిర్వహించిన రాఖీ పండగలో చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్యే పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చాల్కి మాజీ సర్పంచ్ కవిత తండ్రి సంగారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. పార్థివ దేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, మిర్జాపూర్(ఎన్) మాజీ సర్పంచ్ మల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బోనాల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని ఐదుగుళ్ల పోచమ్మ తల్లి ఆలయంలో ఆదివారం జరగనున్న శ్రావణమాస బోనాల ఏర్పాట్లను శనివారం కార్పొరేటర్ పుష్ప నగేష్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

స్వచ్ఛతా ప్రతిజ్ఞ



అధికారుల ప్రతిజ్ఞ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం బీహెచ్ఈఎల్ యూనిట్‌లో శనివారం స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా బెల్ ఈడీ కేబీ రాజా అధికారులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 16వ తేదీ నుంచి 31 వరకు పరిశ్రమలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలో పనిచేసే ప్రతి ఒక్కరూ పని ప్రదేశంలో పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

అవగాహన అవసరం

పటాచెరుటౌన్: విద్యార్థులు, మహిళలు హెల్ప్ లైన్ నంబర్లపై అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ కోమలి సూచించారు. శనివారం జెడ్పీహెచ్ఎస్ మంగంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బాలల హక్కులు, షీటీం, పోక్సో, బాల్య వివాహాల నిషేధ చట్టం, లింగ వివక్షత, సైబర్ నేరాలు, పిల్లల అక్రమ రవాణా తదితర చట్టాల గురించి అవగాహన కల్పించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ శివకుమార్ పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయం కూడలి వద్ద నిరసన తెలుపుతున్న డాక్టర్లు



నారాయణఖేడ్: నిరసన నిర్వహిస్తున్న ప్రైవేట్ వైద్యులు, ఆర్ఎంపీ, పీఎంపీలు



ఝరాసంగం(జహీరాబాద్): నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కోల్‌కతా ఘటనపై నిరసన

జహీరాబాద్ టౌన్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన దారుణాన్ని ఖండిస్తూ పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు ఓపీలు బంద్ చేసిన నిరసనలో పాల్గొన్నారు. లైఫ్‌స్టయిల్ కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి గుండా పోలీసు స్టేషన్ వరకు కొనసాగింది. అనంతరం పోలీసులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు శివబాబు, శంకర్‌లాల్, నవల్‌కిషోర్ సరడా తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు



నారాయణఖేడ్: నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

డాక్టర్లపై దాడులు దారుణం

సంగారెడ్డి : డాక్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని శనివారం పట్టణంలోని జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. నిరసన సందర్భంగా ఆస్పత్రిలో రెండు గంటలు ఓపీ సేవలకు అంతరాయం కలిగింది.

వైద్యురాలిపై అమానుష ఘటనపై నిరసన

నారాయణఖేడ్: కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం పట్టణంలో వైద్యులు, విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యులు, ఆర్ఎంపీ, పీఎంపీలు, ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, ఇసాక్ డిమాండ్ చేశారు.

ఇంద్రప్రస్థ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

జహీరాబాద్: పట్టణంలోని ఇంద్రప్రస్థ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు పరిశీలించారు. కాలనీ వాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఆయన స్పందించి శనివారం సందర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు, దోమల నివారణ తదితర అంశాలను కాలనీ వాసులు ప్రస్తావించారు. దీంతో ఆయన మున్సిపల్ అధికారులు, సిబ్బందిని పిలిపించి సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకుడు పెంటారెడ్డి ఉన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలో శనివారం రూ.60 లక్షల నిధులతో నిర్మించతలపెట్టిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మొట్ట మొదటిసారిగా రైతులందరికీ రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. త్వరలోనే రైతు భరోసా నిధులు సైతం విడుదల కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో నూతన గోదాంలను నిర్మించబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండు, మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ప్రసాద్‌రెడ్డి, రాజు, నరసింహారెడ్డి, వెంకన్న, యాదయ్య, సొసైటీ డైరెక్టర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



సహకార సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

జహీరాబాద్ టౌన్: సిద్దిపేట క్యాంప్ కార్యాలయంపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమై దృష్టి మళ్లించడానికి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయించడం శోచనీయమన్నారు. రుణమాఫీలో ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదని, రైతు భరోసా గురించి మాట్లాడడంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, తగిన సమయంలో బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని, మాజీ మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వాఖ్యలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ కన్వీనర్ బండిమోహన్ ఆరోపించారు.

కఠినంగా శిక్షించాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్: కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఏబీవీపీ సంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం బెంగాల్ సీఎం మమతా బెనర్జీ దిష్టిబొమ్మ దహనం చేశారు. బోడ లక్ష్మణ్, మహేష్, వెంకట్, దినేష్, శశాంక్, నిఖిల్, భారతి పాల్గొనారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన బత్తిని వెంకన్న(65) అనారోగ్యంతో మృతి చెందాడు. ఎస్‌ఐ తిరుపతి తెలిపిన వివరాలు ప్రకారం.. కుటుంబ కలహాల వల్ల వెంకన్న తన భార్య, కొడుకుకు కొంత కాలం నుంచి దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై కోహెడ బస్టాండ్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న వెంకన్నను గమనించిన స్థానికులు పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు సంపత్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వైష్ణవి ఆలయ ప్రతిష్ఠాపన వేడుకలు

సంగారెడ్డి రూరల్: పట్టణంలోని పోతిరెడ్డిపల్లి సీతారామ శివాంజనేయ ఆలయంలో వైష్ణవి దేవాలయ ప్రతిష్ఠాపన వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి వైదిక పర్యవేక్షణలో మొదటి రోజు పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 19వ తేదీన వైష్ణవి దేవి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



రాఖీలు కడుతున్న విద్యార్థులు

విద్యార్థుల రక్షాబంధన్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు రక్షబంధన్ జరుపుకొన్నారు. హెచ్ఎం నాగరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామూహికంగా రక్షబంధన్ నిర్వహించారు. విద్యార్థులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో టీచర్లు లక్ష్మణ్, మధుకర్‌రెడ్డి, రాంచెందర్, జయప్రకాశ్, మారుతి, ఓంనాథ్, నిహారిక, నిర్మల, లక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.


సంక్షిప్త వార్తలు

◆ **ఉత్సాహంగా ఇంగ్లిష్ వండర్ వరల్డ్ ప్రోగ్రాం**



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని డాక్టర్ ఆర్‌ఎల్ఆర్ స్కూల్‌లో శనివారం ఇంగ్లిష్ వండర్ వరల్డ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్పెల్‌బీ, వ్యాస రచన, టంగ్ ట్విస్టర్, డిబేట్ తదితర కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు. చైర్మన్ డాక్టర్ లక్ష్మారెడ్డి భాష ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **హాజరును పక్కాగా నమోదు చేయాలి**



వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల హాజరును ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా పక్కాగా నమోదు చేయాలని మండల ఇన్‌చార్జి ఎంఈఓ కృష్ణ అన్నారు. శనివారం వట్‌పల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎంలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీరోజు మధ్యాహ్న భోజనం అందుతున్న విద్యార్థుల వివరాలను కూడా ప్రత్యేక యాప్‌లో తెలపాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విద్యార్థుల వివరాలతో హాజరైన విద్యార్థులకు సమానంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రంజిత్‌కుమార్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

◆ **దాడుల సంస్కృతి సరికాదు**



నారాయణఖేడ్: దాడుల సంస్కృతి సరైంది కాదని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఖేడ్‌లో శనివారం మాట్లాడారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని తీవ్రంగా ఖండించారు. దాడులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం సమర్థించడమేనని అన్నారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇకముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ **వేతనాలు విడుదల చేయండి**

సంగారెడ్డి టౌన్ : అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు జూలై నెల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో శశికళ, మంగ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

◆ **బలవంతపు డిపాజిట్లు ఆపాలి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్, ప్రజ్ఞాపూర్ ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు రైతులను నుంచి బలవంతపు డిపాజిట్లు తీసుకుంటున్నారని, వాటిని వెంటనే ఆపాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి మూడు వేల నుంచి పది వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. అలాగే చాలా మంది రైతులకు రుణామాఫీ కాలేదని వెంటనే వర్తింపచేయాలనికోరారు.

అందుబాటులో లేని అధికారులు

కాంగ్రెస్ నాయకులు, రైతులు ఆందోళన

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. శనివారం హత్నూరతో పాటు పరిసర గ్రామాల రైతులు రుణమాఫీ వివరాలు తెలుసుకోవడానికి బ్యాంకుకు వెళ్లారు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి తెలుసుకోవాలని బ్యాంకు అధికారులు చెప్పారు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి వస్తే ఒక్క అధికారి కూడా అందుబాటులో లేరు. రెండు మూడు రోజుల నుంచి తిరుగుతున్నా అధికారులు ఎవరూ రావడం లేదని, ఇక రైతు రుణమాఫీ వివరాలను ఎవరిని అడిగి తెలుసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హత్నూర గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లుల పెంటయ్య, దండు పెంటేష్, రాములు, లింగం, రైతులు ఆందోళనకు దిగారు.



హత్నూర వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

పంటల వివరాల నమోదుకు వెళ్లారు

వ్యవసాయ విస్తీర్ణ అధికారులు గ్రామాలలో పంటల వివరాలు నమోదు చేయడానికి వెళ్లారు. మధ్యాహ్నం వరకు గ్రామాల్లో తిరుగుతూ ఆ తర్వాత కార్యాలయానికి వస్తున్నారు. కోర్టు పనులపై తాను వెళ్లినట్లు ఏఓ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు.

– శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి

నత్తనడకన డ్వాక్రా భవన నిర్మాణం



నిర్మాణంలో ఉన్న డ్వాక్రా భవనం

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇంద్రకరణ్‌లో డ్వాక్రా భవన నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. భవనం అందుబాటులో లేక డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఏడేళ్లుగా నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. 2017 అక్టోబర్‌లో అప్పటి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10లక్షలతో డ్వాక్రా భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి ఇప్పటి వరకు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం స్లాబు, గోడలు నిర్మించారు. ప్లాస్టింగ్ అయినప్పటికీ కిటికీలు, తలుపులు బిగించి ఫ్లోరింగ్ తదితర పనులు చేపట్టక పోవడంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. నిర్మాణం పనులు పూర్తికాకపోవడంపై స్వయం సహాయక సంఘాల సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమావేశాలు ఏర్పాటుకు స్థలం లేక ఇంళ్ల ముందు నిర్వ హించుకోవాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

న్యాల్‌కల్(జహీరాబాద్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడు గణపతి రావు అన్నారు. స్థానిక కేజీబీవీలో కొందరు బాలికలకు దగ్గు, జ్వరం వచ్చిన విషయాన్ని గుర్తించి విద్యాలయంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు సోకుండా ఉండేందుకు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మార్త, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, కేజీబీవీ ప్రత్యేక అధికారి, సిబ్బంది పాల్గొన్నారు. కోలకతాలో పీజీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ స్థానిక వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. పీహెచ్‌సీ ఆవరణలో బాధితురాలి చిత్రపటం ఉంచి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలించారు.



బాలికలను పరీక్షిస్తున్న వైద్యులు

విద్యార్థులకు నాణ్యమైన విద్య

- ప్రభుత్వం ప్రత్యేక చర్యలు: ఎంఈఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. శనివారం హద్నూర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చేటట్లు చూడాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించిన అంశాలను ఇంటి వద్ద చదువుతున్నారా ?లేదా? చూడ వలసిన బాధ్యత పేరెంట్స్‌పై ఉందన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ మారుతి

వారిపై చర్యలు తీసుకోండి

పటాన్‌చెరు టౌన్: సోషల్ మీడియా వేదికగా మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం డీఎస్పీ రవీందర్‌రెడ్డికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో దూసుకెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు చూసి బీఆర్‌ఎస్ నాయకులు సోషల్ మీడియా వేదికగా చేసిన అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ కార్యదర్శి మతిన్, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్‌కే అతిక్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఫయాజ్, పట్టణ కార్యదర్శి అబ్దుల్లా, కాంగ్రెస్ నాయకులు సాయిలు ముదిరాజ్, అక్షిత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంగమేశ్వర మందిరంలో పూజలు

కల్హేర్(నారాయణఖేడ్): వర్షం కోసం కల్హేర్ మండల కేంద్రంలో శనివారం గ్రామస్తులు పూజలు చేశారు. గ్రామ సమీపంలోని సంగమేశ్వర మందిరంలో జలాభిషేకం చేశారు. అక్కడి నుంచి కామారెడ్డి జిల్లా పిట్లం, నర్సింగ్‌రావుపల్లి, మొగులూర్, వెల్లనూర్, బ్రహ్మణ్‌పల్లి, ఆరేడ్, అరెపల్లి, మహదేవుపల్లి, దేవునిపల్లి, మాసాన్‌పల్లి మీదుగా బైక్ ర్యాలీ చేశారు. 11 గ్రామల్లోని హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. వానకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండాలని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బాలయ్య, గంగారెడ్డి, వీర్‌షెట్టి, రమేశ్‌గౌడ్, విఠల్, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సంగమేశ్వర మందిరంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

అంతా నా ఇష్టం

- ఐకేపీ ఏపీఎం విధులకు గైర్హాజరు
- సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్ విధులకు డుమ్మా..

వట్‌పల్లి(అందోల్): మండల మహిళా సమాఖ్య ఉద్యోగులు ఇష్టారీతిన విధులను నిర్వహిస్తూ విధులకు హాజరుకావడం లేదు. వట్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో ఏపీఎంతో పాటు నలుగురు సీసీలు, ఒక కంప్యూటర్ ఆపరేటర్లు మొత్తం ఆరుగురు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఏపీఎంతో పాటు ఇద్దరు సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగులు వారిపై అధికారులకు ఎటువంటి సమాచారం లేకుండానే విధులకు గైర్హాజరయ్యారు. దీంతో ఐకేపీ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఈ విషయమై అడిషనల్ డీఆర్‌డీఓ జంగారెడ్డిని వివరణ కోరగా.. ఏపీఎం విధులకు గైర్హజరవడంలో అధికారికంగా ఏ అనుమతి తీసుకోలేదు. ఏపీఎంతో పాటు మరో ముగ్గురు ఉద్యోగ సిబ్బంది విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విధులకు గైర్హజరు కావడంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400